సెబ్‌కు బై.. బై..

గత ప్రభుత్వ విధానంతో విభజన తప్ప.. ఒరిగిందేమీ లేదు..

- ఐదేళ్లలో పెరిగిన పేకాట, గంజాయి, మద్యం అక్రమ రవాణా
- సెబ్ రద్దుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం
- ఎక్సైజ్ శాఖకు ఉద్యోగులు
- సర్వత్రా హర్షాతిరేకాలు



మొన్నటి వరకు ఉన్న సెబ్ స్టేషన్ పేరు


ఎక్సైజ్ స్టేషన్‌గా మారిన తరువాత హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు (ఫైల్)

హిందూపురం, సెప్టెంబరు 15: గత వైసీపీ ప్రభుత్వం ఇసుక, కర్ణాటక మద్యం అక్రమ రవాణా, గంజాయి, పేకాట, మట్కాను రూపు మాపుతామని చెప్పి ఎక్సైజ్‌శాఖను విడగొట్టి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)ను ఏర్పాటు చేసింది. వీటిని అరికట్టడం దేవుడికెరుక ఒడిశా సరిహద్దులో ఉన్న గంజాయి జిల్లాలో చిల్లర కొట్టులో కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. సెబ్ పోలీసులు అడ్డుకున్నది మాత్రం లేదు. గత వైసీపీ ప్రభుత్వం పైన పేర్కొన్నవాటిని నిర్మూలిస్తామని గొప్పలుచెప్పి ఎక్సైజ్ శాఖ నుంచి కొంతమంది అధికారులు, సిబ్బంది విడగొట్టి సెబ్‌లో కలిపారు. మేలుకంటే కీడే ఎక్కువగా ఉంది. ఎందుకంటే గత వైసీపీ హయాంలో విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు, పేకాట స్థావరాలు, మట్కా, కర్ణాటక నుంచి మద్యం ఏరులై పారింది. వీటిని అరికట్టడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఈ పరిస్థితుల్లో విఫలమైన శాఖలను గాడిలోపెట్టే పనిలో కూటమి ప్రభుత్వం పడింది. ఆ దిశగా సెబ్‌ను రద్దుచేసి, ఎక్సైజ్‌శాఖలోకి విలీనం చేశారు. సెబ్‌లో ఉన్న ఉద్యోగులంతా మాతృశాఖకు వెళ్లాలని ఆదేశాలు ఇచ్చారు. అప్పటి ముఖ్యమంత్రి, వైసీపీ నాయకులు సొంత లాభం కోసం ఏర్పాటు చేసుకున్న సెబ్ రద్దయి, పాత విధానం అమలులోకి రావడంతో ఆ ఉద్యోగులు, సిబ్బంది అంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

గతంలో వైసీపీ ప్రభుత్వం జీఓ నంబరు 12ద్వారా సెబ్‌ను తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ఉమ్మడి అనంత జిల్లాలో 18 పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేశారు. అనంతపురం జిల్లాలో 10, శ్రీసత్యసాయి జిల్లాలో 8 ఉన్నాయి. ఈ స్టేషన్లలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందిని ఎక్సైజ్‌శాఖ నుంచి తీసుకున్నారు. సెబ్ వచ్చిన తరువాత కర్ణాటక, గోవా, తమిళనాడు నుంచి మద్యం అక్రమ రవాణా, నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్, ఇసుక అక్రమ రవాణా పెరిగాయి తప్ప.. తగ్గలేదు. గత టీడీపీ పాలనలో పోల్చితే వైసీపీ హయాంలో మద్యం అక్రమ రవాణా కేసులు విపరీతంగా పెరిగాయి. దీనిని బట్టి సెబ్ ఏస్థాయిలో పనిచేసిందో అర్థం అవుతుంది. కూటమి ప్రభుత్వం రాగానే వైసీపీ తీసుకున్న అనాలోచిత నిర్ణయాలను సరిదిద్ది సెబ్‌ను రద్దుచేసి ఎక్సైజ్‌ను పునర్ వ్యవస్థీకరించారు. గతనెల 25న మంత్రివర్గ సమావేశంలో పాత ఎక్సైజ్ విధానం అమలుకు ఆమోదం తెలిపారు. దీంతో సెబ్ స్టేషన్‌లో ఉన్న వాహనాలు, ఫర్నీచర్, కంప్యూటర్లు, వివిధ కేసుల్లో జప్తుచేసిన వాహనాలు, సామాగ్రిని కూడా ఎక్సైజ్‌కు ఇవ్వాలని ఆదేశాలిచ్చారు.

ఇక నుంచి ఎక్సైజ్ స్టేషన్లు..

ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ దశాబ్దాల నుంచీ ఉంది. గత వైసీపీ హయాంలో ఉమ్మడి జిల్లాలో 18 సెబ్ స్టేషన్లుగా మార్చారు. అవి ప్రస్తుతం ఎక్సైజ్ స్టేషన్లుగా మారనున్నాయి. సెబ్ స్టేషన్ పేర్లుకూడా మార్చేశారు. శనివారం నాటికి జిల్లాలో అన్ని స్టేషన్లమీద ఎక్సైజ్ స్టేషన్లుగా పేర్లు మార్చారు. గతంలో ఎక్సైజ్ శాఖ సమర్థవంతంగా పనిచేసింది. ఇక నుంచి కూడా అలాగే చేస్తుందని ప్రభుత్వం భావించింది. ఎక్సైజ్‌శాఖలో కూడా పోలీసు అజమాయిషీ ఉండేది. దీంతో ఎక్సైజ్‌శాఖ దాదాపు నిర్వీర్యం అయినట్లు ఆ ఉద్యోగులే విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం పాత విధానం తీసుకురావడంతో ఎక్సైజ్‌శాఖ మళ్లీ పటిష్ఠంగా మారనుంది. ఇక ప్రతి స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఎస్‌హెచ్‌ఓగా ఉంటారు. ఒక స్టేషన్‌కు ఇద్దరు ఎస్ఐలు, నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 12మంది కానిస్టేబుళ్లను నియమించినట్లు తెలుస్తోంది.

ప్రైవేటుకే మద్యం షాపులు

గత వైసీపీ హయాంలో ప్రైవేటు మద్యం షాపులను రద్దుచేసి, ప్రభుత్వ మద్యం దుకాణాలు తీసుకొచ్చింది. వాటిలో నాణ్యమైన సరుకును అమ్మకుండా వైసీపీ నాయకులకు చెందిన నాణ్యతలేని మద్యం విక్రయించారు. తద్వారా షాపుల ద్వారా జరిగిన వ్యాపారం కూడా వైసీపీ నాయకుల జేబుల్లోకి వెళ్లింది. ప్రభుత్వానికి ఎలాంటి ఆదాయం సమకూరలేదు. నాశిరకం మద్యం తాగి చాలామంది అనారోగ్యం పాలయ్యారు. చాలామంది ప్రాణాలు కూడా కోల్పోయారు. ఇదంతా ఆ ప్రభుత్వ తప్పిదాలను గుర్తించిన కూటమి ప్రభుత్వం పాత మద్యం దుకాణాల విధానంపై దృష్టిపెట్టింది. ఇక మళ్లీ ప్రైవేటు మద్యం దుకాణాలు రావచ్చని భావిస్తున్నారు. ఇప్పటికే కొంతమంది దుకాణాలు, టెండర్లపై ఎలా ఉంటుందోనన్న దానిపై సమాలోచిస్తున్నారు. అలా చేస్తే ప్రభుత్వానికి ఆదాయం పెరగనుంది..

ఆసుపత్రి ఏర్పాటుకు స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రులు సత్యకుమార్, సవిత

గోరంట్ల, సెప్టెంబరు 15: ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ రూ.8కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన ఆసుపత్రి ఏర్పాటుకు గోరంట్ల మండలంలోని పాలసముద్రం జాతీయ రహదారి పక్కన స్థలాన్ని రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ఆదివారం పరిశీలించారు. పాలసముద్రం కూడలి వద్ద కొత్తూరు గ్రామం సర్వే నంబరు 130-3లోని ప్రభుత్వ స్థలాన్ని ఆసుపత్రి నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు కేటాయించారు. మంత్రులు స్థలాన్ని పరిశీలించగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు, రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా ఛైర్మన్ జీఎం శేఖర్ ఆసుపత్రి నిర్మాణానికి ఆర్థిక వనరులతోపాటు సాయం చేయాలని కోరారు. మంత్రులు సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వం నుంచి అన్నిరకాల సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్, డయాలసిస్ సెంటర్, క్యాన్సర్ టెస్టింగ్ లాంటి ఆధునిక సదుపాయాలు కల్పిస్తామని శేఖర్ వివరించారు. పెనుకొండ నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో భవన వసతి, సిబ్బంది కొరత, తీవ్రంగా ఉండడంతో వైద్య సేవలు సరిగా అందడంలేదని మంత్రికి ప్రజలు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రెడ్డిశేఖర్, ఆర్ఐ సోముశేఖర్ రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, కన్వీనర్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మామపై అల్లుడి దాడి

కదిరి అర్బన్, సెప్టెంబరు 15: మామపై అల్లుడు దాడిచేసిన సంఘటన మండలంలోని యాకాలచెరువుకొత్తపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన ఆంజనేయులు కుమార్తెను బుక్కపట్నం మండలంలోని బిట్టువారిపల్లికి చెందిన శివకుమార్‌కు ఇచ్చి వివాహం చేశారు. కుమార్తె గర్భవతి కావడంతో పుట్టినింటికి పిలుచుకొచ్చారు. ఆదివారం కుమార్తెను గ్రామంలోని దుకాణానికి పంపగా, తన భార్య, గర్భవతి అని దుకాణానికి ఎందుకు పంపావని మామతో వాదనకు దిగారు. మాట మాట పెరిగి ఇద్దరిమధ్య ఘర్షణకు దారి తీసింది. ఘర్షణలో కొడవలిలో అల్లుడు మామపై దాడిచేశాడు. మామకు గాయం కావడంతో కుటుంబ సభ్యులు కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, చికిత్స అనంతరం పోలీసులకు ఫిర్యాదుచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

ప్రజాసంక్షేమమే కూటమి లక్ష్యం

- మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, సత్యకుమార్
- నూతన బస్సుల ప్రారంభం


ఆర్టీసీ సర్వీసులను ప్రారంభిస్తున్న మంత్రులు

ధర్మవరం, సెప్టెంబరు 15: ప్రజాసంక్షేమమే కూటమి లక్ష్యమని రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ధర్మవరంలోని ఆర్టీసీ బస్టాండులో ఆదివారం ఆరు బస్సులను మంత్రి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో ఆర్టీసీని విలీనం చేశారే తప్ప.. సమస్యలు పరిష్కరించకపోవడం వల్ల నేటికీ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైసీపీ కార్యాలయాల కోసం ఆర్టీసీ స్థలాలను కూడా తాకట్టుపెట్టడం విచారకరమన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంవచ్చిన 90 రోజుల్లోనే 600 నూతన బస్సులు నడుపుతున్నామన్నారు. రానున్న ఐదేళ్లలో 5వేల బస్సులను ఏర్పాటుచేసేందుకు ముఖ్యమంత్రితో చర్చిస్తామన్నారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ప్రతి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజారవాణాధికారి మధుసూదన్, డీఎస్పీ శ్రీనివాసులు, కమిషనర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ వర్సెస్ ఎస్కార్ట్ సిబ్బంది

రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలోనే పార్కింగ్ విషయంలో డీఎస్పీ, మంత్రి ఎస్కార్ట్‌సిబ్బంది మధ్య తీవ్ర వాగ్వాదం సాగింది. ధర్మవరం ఆర్టీసీ డిపో గ్యారేజ్ ఇందుకు వేదికైంది. ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు.. రవాణాశాఖ మంత్రి వెంట ఎస్కార్ట్‌గా వచ్చిన వాహన డ్రైవర్, సిబ్బంది మధ్య రేయ్ అన్న పదం ఉత్పన్నం కావడంతో వాదోపవాదాలు సాగాయి. అక్కడికి వచ్చిన మిగతా శాఖల అధికారులు, సిబ్బందితోపాటు ఆర్టీసీ కార్మికులు సైతం మంత్రి కార్యక్రమాన్ని పక్కనపెట్టి వీరి వివాదాన్ని చూస్తూ ఉండిపోయారు. 'రేయ్ వాహనం పక్కన పెట్టు' అంటూ డీఎస్పీ సంబోధించారని ఎస్కార్ట్ సిబ్బంది ఆరోపిస్తున్నారు. 'నేను రేయ్ అనలేదనీ, అరే పక్కనపెట్టు' అన్నానని డీఎస్పీ చెప్పుకొస్తున్నారు. ఈ విషయమై ఇరువురి మధ్య 5 నిమిషాలపాటు వాగ్వాదం సాగింది. చివరికి అక్కడే ఉన్న పలువురు సీఐలు, ఇంటెలిజెన్స్ అధికారులు కలుగజేసుకుని డీఎస్పీని పక్కకు తీసుకెళ్లడంతో వివాదం సద్దుమణిగింది.

అలరించిన మాయానాటకం

ఘనంగా ఓనం వేడుకలు


నృత్యం చేస్తున్న చిన్నారులు


వామనునితో బలిచక్రవర్తి





సాయికుల్వంత్ సభామండపంలో ప్రత్యేక అలంకరణ

పుట్టపర్తి, సెప్టెంబరు 15: ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో ఓనం వేడుకలను ఘనంగా నిర్వహించారు. మూడోరోజు ఆదివారం కేరళభక్తులు సంగీత సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. బాలవికాస్ చిన్నారులు మాయానాటక సూత్రధారి పేరిట సంగీత నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. కేరళ సంప్రదాయ రీతిలో చేపట్టిన నృత్యం భక్తులను పరవశింపజేసింది. వామనుడు బలిచక్రవర్తి పాత్రధారులు హావభావాలతో ఆకట్టుకున్నారు. బాలవికాస్ చిన్నారులకు సత్యసాయి యూనివర్సిటీ చాన్సిలర్ చక్రవర్తి పట్టువస్త్రాలను అందించి, అభినందించారు. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఓనం వేడుకలను పురస్కరించుకుని సాయికుల్వంత్‌సభామండపాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. వేడుకల్లో అడిషనల్ డీజీపీ శ్రీజిత్‌తో పాటు వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

మోటారు వాహన కార్యాలయం తనిఖీ

ధర్మవరం, సెప్టెంబరు 15: ధర్మవరంలోని మార్కెట్‌యార్డ్ వద్దనున్న మోటారు వాహన కార్యాలయాన్ని రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తనిఖీ చేశారు. కార్యాలయం రేకులషెడ్‌లో నిర్వహిస్తుండటంతో ఇక్కడ ఎలా పనిచేస్తారని అసహనం వ్యక్తం చేశారు. ఒక ప్రభుత్వ కార్యాలయం ప్రారంభించేటప్పుడు అనుకూల పరిస్థితులు గురించి ఆలోచించాలి కదా అని అధికారులను ప్రశ్నించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మంత్రి మొక్కలు నాటారు. ఆర్‌టీఓ కరుణసాగర్‌రెడ్డి, ఎంవీఐలు వరప్రసాద్, రాణి పాల్గొన్నారు.

పోస్టల్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, సెప్టెంబరు 15: జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు దీన్‌దయాళ్ స్పర్శ్ యోజన స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి మీనాక్షి ఆదివారం ప్రకటనలో కోరారు. 2024-25 విద్యాసంవత్సరానికిగాను విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలకు 16వ తేదీలోగా కర్నూల్ రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ పేరిట పోస్టుద్వారా పంపిన దరఖాస్తు ఫారాన్ని ఉపవిద్యాశాఖ, మండల విద్యాశాఖ కార్యాలయాల్లో పాఠశాలల హెచ్‌ఎంలు అందజేయాలని సూచించారు. 30వ తేదీన పోటీలు నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన వారికి ఏడాదికి రూ.6వేలు పోస్టల్ శాఖ ద్వారా ఉపకార వేతనాన్ని అందిస్తారన్నారు.

నెలలోపు కణేకల్లు బ్రిడ్జి నిర్మాణ పనులు

ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ నయీముల్లా



కణేకల్లు వద్ద బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఈఎన్‌సీ నయీముల్లా, జిల్లా అధికారులు

కణేకల్లు, సెప్టెంబరు 15: కణేకల్లు వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులను నెల రోజుల్లోపు ప్రారంభిస్తామని ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ నయీముల్లా తెలిపారు. ఆదివారం కణేకల్లు వద్ద ఉన్న బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఎన్‌సీ మాట్లాడుతూ కణేకల్లు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి రూ. 48 కోట్లతో ప్రతిపాదనలు పెట్టగా గత ప్రభుత్వంలో టెక్నికల్ కమిటీ, ఫైనాన్స్ కమిటీలు అంగీకరించకపోవడంతో పనులు నిలిచి పోయాయన్నారు. ఆర్థికశాఖమంత్రి పయ్యావుల కేశవ్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రత్యేక చొరవతో ప్రభుత్వంతో చర్చించి అన్ని సమస్యలు క్లియర్ చేయించారని తెలిపారు. మరో నెలరోజుల్లోపు వీటికి సంబంధించి అప్రూవల్స్ అందించి పనులు ప్రారంభిస్తామని, రెండేళ్లలో బ్రిడ్జి నిర్మాణం పూర్తవుతుందన్నారు. తద్వారా ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందిపడుతున్న సమస్యకు బ్రేక్ పడుతుందన్నారు. 450 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో ప్రస్తుతం ఉన్న హెచ్చెల్సీ అక్విడెక్ట్ కన్నా ఎత్తులో బ్రిడ్జి నిర్మాణం చేస్తామని అన్నారు. స్థల పరిశీలనకు వచ్చిన ఈఎన్‌సీకి స్థానిక మండల టీడీపీ నాయకులు మాబుసాబ్, చాంద్‌బాషా, షేక్‌ముజ్జు, ముస్లిం సాంప్రదాయ పద్ధతిలో సత్కారం చేశారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ ఓబులరెడ్డి, ఈఈ రాజగోపాల్, డీఈ రవిశంకర్‌రెడ్డి, ఏఈ సుజితతో పాటు టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, బీటీ రమేష్, అనిల్, నాగరాజు, తిప్పేస్వామి, చిన్నసలీం, శేఖర్ పాల్గొన్నారు.

రామసాగరం బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు

బెళుగుప్ప: మండలంలోని పెన్నానదిపై రామసాగరం సమీపంలో హైలెవెల్ వంతెన బ్రిడ్జిని నిర్మించేందుకు ఆదివారం ఆర్అండ్‌బీ ఈఐఎన్‌సీ నయీముల్లా పరిశీలించారు. పీఏబీఆర్ డ్యామ్ నీరు గతంలో ఉన్న బ్రిడ్జిపైకి చేరి మండలం నుంచి అనంతపురానికి రాకపోకలు ఆగిపోయాయి. మండల ప్రజలకు మంత్రి పయ్యావుల కేశవ హామీ నిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో హామీని నెరవేర్చేందుకు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా రూ. 90 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపి మంజూరుకు చర్యలు తీసుకున్నారు. అనుమతులు రాగానే వేగవంతంగా పనులకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

23 వరకు ఈ-పంట నమోదు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 15: ఈ ఏడాది ఖరీఫ్ ఈ-పంట నమోదు గడువును ఈనెల 23వతేదీ వరకు పొడిగించారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు ఆదివారం వరకే గడువు విధించారు. ఈనెల 23వతేదీలోపు ఈ-పంట నమోదుతోపాటు రైతుల ఈకేవైసీ పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. ఈనెల 25 నుంచి 27వతేదీ వరకు రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట వివరాలు ప్రదర్శించడంతో పాటు గ్రామ సభలు నిర్వహించి, సోషల్ ఆడిట్ నిర్వహించాలని నిర్ణయించారు. 28 నుంచి 29వతేదీ వరకు రైతులతో అర్జీలు స్వీకరిస్తారు. ఈనెల 30న తుది జాబితాను ప్రదర్శించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో 8.88 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇప్పటిదాకా 8.88 లక్షల ఎకరాల్లోనూ (100 శాతం) ఈ పంట నమోదు చేశారు. ఈ-పంట నమోదు వివరాలు సర్వర్‌కు అప్‌లోడ్ చేసిన తర్వాత వీఏఏ అథంటికేషన్ చేస్తారు. ఆ తర్వాత వీఆర్వో అంథంటికేషన్ చేయాల్సి ఉంటుంది. ఇప్పటి దాకా రైతు సేవా కేంద్రం సిబ్బంది 8.62 లక్షల ఎకరాలకు అంథంటికేషన్ చేశారు. ఇందులో 8.37 లక్షల ఎకరాలకు వీఆర్వోలు అంథంటికేషన్ పూర్తయింది. రైతు సేవా కేంద్రం సిబ్బంది, వీఆర్వో అథంటికేషన్ తర్వాత రైతుతో ఈకేవైసీ చేయిస్తేనే ఈ-పంట పూర్తవుతుంది. ఇప్పటిదాకా 3.30 లక్షల మంది రైతులతో ఈకేవైసీ వేయించారు. గడువులోగా రైతులతో ఈకేవైసీని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎన్ఎంయూఏ జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి



మాట్లాడుతున్న ఎన్ఎంయూ జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 15: ఏపీఎస్ ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎంయూఏ జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని పీవీకేకే కళాశాలలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం హయాం నుంచి నిలిపివేసిన నైట్ అవుట్, ఓటీ అలవెన్సులను పునరుద్ధరించాలన్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన అన్నిరకాల అరియర్స్, సిక్ లీవుల జీతాలు, ఇంక్రిమెంట్ల అరియర్స్, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బెనిఫిట్స్‌ను ట్రెజరీశాఖ అధికారులు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రిస్వామి, కార్యదర్శి నాగరాజు, జిల్లా చైర్మన్ సూరిబాబు, కార్యదర్శి ప్రతాప్ నారాయణ, సలహాదారులు ఆదినారాయణ, పుల్లయ్య, డీఎస్ రెడ్డి, సీవీపీ సదాశివరెడ్డి, సంయుక్త కార్యదర్శి అనిత, మనోజ్‌కుమార్, మద్దిలేటి పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

ఏరువాక కో-ఆర్డినేటర్ రామసుబ్బయ్య

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 15 : జిల్లాలో వేరుశనగపంటను సాగుచేస్తున్న రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక కోఆర్డినేటర్ రామసుబ్బయ్య ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ప్రస్తుతం వేరుశనగపంట కాయ అభివృద్ధి దశలో ఉందన్నారు. వేరుశనగకు మచ్చతెగులు ఆశించినదని దీని నివారణకు ఎక్సకోనజోన్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే కందిపంట 65 రోజులకు ప్రొపినోపాస్ రెండు మిల్లీలీటర్లు లేదా ఓమైట్ ఒక మిల్లీలీటరును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. మొక్కజొన్నపంట విత్తనం కంకి ఏర్పడే దశలో ఉందన్నారు. 60 రోజులకు యూరియా 50కిలోలు, 25కిలోలు పొటాష్ ఎరువులను వాడుకోవాలని సూచించారు. వరి పిలకల దశలో ఉందని, పైపాటుగా యూరియా 50కిలోలు ఎకరానికి వాడుకోవాలన్నారు. వరిని నల్లి ఆశించందని దీని నివారణకు ప్రొఫైనోపాస్ 2 మిల్లీలీటర్లు లేదా ఓమైట్ ఒక మిల్లీలీటరును లీటర్ నీటితో కలిపి పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు.

డీఎస్పీల నియామకం

అనంతపురం క్రైం, సెప్టెంబరు 15: అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో పలు సబ్ డివిజన్లకు డీఎస్పీలను నియమించారు. గత నెలలో డీఎస్పీలను బదిలీ చేసినా వారి స్థానాల్లో ఎవరినీ నియమించలేదు. ఆదివారం జరిగిన బదిలీల్లో ఉమ్మడి జిల్లాల పరిధిలో కొందరు డీఎస్పీలను నియమించారు. అనంతపురం డీఎస్పీగా సీఐడీ డీఎస్పీగా పనిచేస్తున్న వల్లూరి శ్రీనివాసరావును నియమించారు. అనంతపురం రూరల్ డీఎస్పీగా వెయిటింగ్‌లో ఉన్న టి.వెంకటేశ్వర్లు, గుంతకల్లు డీఎస్పీగా కందుకూరు డీఎస్పీ ఆముద్ధ శ్రీనివాసులు, తాడిపత్రి డీఎస్పీగా ఇంటిలిజెన్స్‌లో పనిచేస్తున్న పి.రామకృష్ణుడు, అనంతపురం మహిళా పీఎస్ డీఎస్పీగా ఎస్.మహబూబ్‌బాషా, డీపీటీసీ డీఎస్పీగా వెయిటింగ్‌లో ఉన్న శరత్‌రాజ్‌కుమార్, కదిరి డీఎస్పీగా వెయిటింగ్‌లో ఉన్న జె.శివనారాయణ స్వామి, అనంతపురం 14వ బెటాలియన్, ఏపీఎస్పీ డీఎస్పీగా బి.సునీల్‌ను నియమించారు.

బంజారాల బ్రహ్మోత్సవం తీజ్

- గిరిజనుల సంప్రదాయ పండుగ
- తండాలకు తరలిరానున్న గిరిజనులు
- నేటి నుంచి 26వరకు ఉత్సవాలు



తీజ్ ఉత్సవాల్లో భాగంగా వెదురుబుట్టల్లో గోధుమలు నాటిన దృశ్యం (ఫైల్)

ఉరవకొండ, సెప్టెంబరు 15: బంజారాలు తమ సంప్రదాయ పండుగను తీజ్‌ను శతాబ్దాల నుంచే చేసుకుంటున్నారు. దీనిని బంజారాల బ్రహ్మోత్సవాలుగా పిలుస్తారు. ఈ పండుగ అంటే బంజారా యువతులు, మహిళలకు ఎంతో ఇష్టం. ఈ సంప్రదాయ ఉత్సవాల పరిరక్షణకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని బంజారాలు కోరుతున్నారు. బంజారాల బతుకమ్మ పండుగగా చెప్పుకునే తీజ్ గిరిజనులకు పెద్ద ఉత్సవం. ప్రతి ఏటా భాద్రపద మాసంలో 11 రోజుల పాటు తీజ్ ఉత్సవాలు ఘనంగా చేసుకుంటారు. ఈ నెల 16నుంచి 26 తేదీ వరకూ తీజ్ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఉరవకొండ మండలంలోని వెంకటాంపల్లి పెద్దతండా, చిన్నతండాల్లో ఉత్సవాలు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.



నృత్యం చేస్తున్న మహిళలు (ఫైల్)

ఉత్సవాలు ఇలా...

బంజారాల తీజ్‌కు తెలంగాణ బతుకమ్మ పండుగకు చాలా పోలికలు ఉన్నాయి. బతుకమ్మ పండుగ తరహాలోనే బంజారాలు ప్రత్యేకంగా అల్లిన వెదురు బుట్టల్లో సేంద్రియ ఎరువులు, పుట్టమన్ను, ఇసుక తీసుకువస్తారు. వీటిన్నంటినీ కలిపి వెదురుబుట్టలో వేసి గోధుమ గింజలు నాటుతారు. వేసిన నాటి నుంచి యువతులు క్రమంతప్పకుండా ఉదయం సాయంత్రం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి వెదురు గంపలలోకి నీటిని పోస్తారు. ఇలా 11రోజులుపాటు వేస్తారు. బుట్టలన్నింటినీ గురునానక్ దేవాలయం వద్ద ఉంచి పొలాల్లోని తంగేడు, గరుగు, జాజి మల్లెలు తదితర పుష్పాలను వరుస క్రమంలో అమర్చుతారు. మధ్యలో గోధుమ మొక్కలు కనిపించేలా తయారు చేసుకుంటారు. బంజారాల సంప్రాదాయం ప్రకారం నృత్యాలు చేస్తూ, పాటలు పాడుతూ పండుగ నిర్వహిస్తారు. యువతులు ఇలా చేస్తే మంచి వరుడు దొరుకుతాడని వారి నమ్మకం. మహిళలు ఇలా చేస్తే వారి దాంపత్య జీవితం సిరిసంపదలు, పిల్లాపాపలతో సంతోషంగా గడుపుతారని విశ్వాసం. మహిళలు కులదైవాలను స్మరించుకుంటూ సేవాలాల్ దేవాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఏటా సకాలంలో వర్షాలు కురిసి, పాడిపంటలతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని దేవతలను ఆరాధిస్తారు.

తీజ్ ఎంతో ప్రత్యేకం

ప్రతి ఏటా ఖరీఫ్ విత్తనం వేసిన తర్వాత భాద్రపద మాసంలో 11రోజుల పాటు తీజ్ ఉత్సవాలు నిర్వహిస్తారు. తండా వాసులు సంచారం కోసం ఎక్కడికెళ్లినా తీజ్ ఉత్సవాలకు సొంత గ్రామాలకు వస్తారు. తీజ్ ఉత్సవంలో బంజారాలో ఉన్న గోత్రాల ప్రకారం 52 వెదురు బుట్టలను ఏర్పాటు చేస్తారు. గురునానక్ దేవాలయం వద్ద తీజ్ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. గురునానక్ దేవాలయంలో వారం రోజుల క్రితం మొలక కట్టిన గోధుమలకు పూజలు నిర్వహించి బయటకు తీస్తారు. మొలకలు ఉన్న గంపలను ఆలయ ప్రాంగణంలో తీజ్ ఆకారంలో ఉంచి పూజలు చేస్తారు. యువతులు సంప్రదాయ వేషధారణ అందరినీ ఆకట్టుకుంటుంది.

ప్రభుత్వమే నిర్వహించాలి



బంజారాల సంప్రదాయం కనుమరుగు కాకుండా చూడాల్సి బాధ్యత యువతపై ఉంది. తీజ్ పండుగను ప్రభుత్వమే నిర్వహించాలి. పండుగ విశిష్టతపై విస్తృత ప్రచారం జరగాలి. తీజ్‌లో పాల్గొనడం గర్వంగా ఉంది. ఈ పండుగంటే ఎంతో ఇష్టం.

- కల్పనాబాయి, పారామెడికల్ విద్యార్థిని

ఐక్యతకు ప్రతీక



తీజ్ పండుగ ఐక్యతకు ప్రతీక. కనుమరుగు కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. పండుగ కోసం తండాకు వచ్చాం. బంధుల మధ్య పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉంది.

- తేజస్విని, విద్యార్థిని



ఏర్పాట్లను పరిశీలిస్తున్నగ్రామస్థులు



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న ములాని



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న అన్షుల్ కాంబోజ్

ఆట అదుర్స్..!

- అభిమానులతో కిటకిటలాడిన ఏసీజీ
- ఇండియా- డిపై ఇండియా-ఎ విజయం
- రికీ భుయ్ వీరోచిత శతకం వృథా
- డ్రాగా ముగిసిన ఇండియా- బి, ఇండియా- సి మ్యాచ్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 15: ఊహించినట్లుగా ఇండియా-ఏ జట్టు భారీ విజయం సాధించింది. ఇండియా-బి, ఇండియా- సి జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. స్థానిక అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో రెండో రౌండ్ దులీప్‌ట్రోఫీ క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఓవర్‌నైట్ స్కోర్ 62/1తో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా-డి లక్ష్య ఛేదనలో విఫలమైంది. తెలుగుతేజం రిక్కీ భుయ్ వీరోచిత (113) సెంచరీతో ఆకట్టుకున్నా తన జట్టును గెలుపు తీరాలకు చేర్చలేకపోయాడు. చివరి రోజు 426పరుగులు సాధించాల్సి ఉండగా ఇండియా-డి 82.2ఓవర్లలో 301పరుగులకు ఆలౌట్ అయ్యింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 41, యశ్ దుబే 37, సంజు శ్యాంసన్ 40 పరవాలేద నిపించగా మిగతా బ్యాటర్లు విఫలమవడంతో పరాజయం తప్పలేదు. దీంతో ఇండియా ఏ జట్టు 186పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇండియా ఏ బౌలర్లు తనుష్ కొటియాన్ 4వికెట్లు, షాంశ్‌ములానీ 3, ఖలీల్‌అహ్మద్, రియాన్ పరాగ్‌లో చెరో వికెట్ పడగొట్టారు. ఇండియా ఆల్ రౌండర్ షాంశ్‌ములానీ ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచాడు. ఇండియా- ఏ జట్టులో తిలక్‌వర్మ, ప్రథమ్‌సింగ్ సెంచరీలు సాధించారు. ఇండియా-డి జట్టులో రిక్కీభుయ్ సెంచరీ సాధించాడు.

డ్రాగా ముగిసిన ఇండియా బి, ఇండియా సి మ్యాచ్

దులీప్‌ట్రోఫీలో భాగంగా ఇండియా-బి, ఇండియా- సి జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. నాలుగు రోజుల మ్యాచ్‌లో ఇండియా- సి మొదటి ఇన్నింగ్స్‌లో 525 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇండియా-బి మొదటి ఇన్నింగ్స్‌లో 332 పరుగులకు ఆలౌట్ అయ్యిం ది. రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇండియా-సి జట్టు చివరి రోజు 37ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 124 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జట్టులో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 62, రజిత్ పటిదార్ 42 రాణించారు. రాహుల్ చాహర్ 2, ముకేష్‌కుమార్, ముషీర్‌ఖాన్‌లు చెరో వికెట్ పడగొట్టారు. ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా- సి బ్యాటర్ ఇషాన్ కిషాన్, ఇండియా- బి కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ శతకాలతో మెరిశారు. చివరి రోజు కావడం, ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇండియా- బి రెండో ఇన్నింగ్స్ ఆరంభించకనే అంపైర్లు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. ఆల్‌రౌండర్ అన్షుల్‌కాంబోజ్ ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచారు.

స్కోరు వివరాలు

ఇండియా-ఎ
మొదటి ఇన్నింగ్స్- 290పరుగులకు ఆలౌట్
రెండో ఇన్నింగ్స్- 380/3 డిక్లేర్డ్
ఇండియా-డి
మొదటి ఇన్నింగ్స్- 183 ఆలౌట్
రెండో ఇన్నింగ్స్- 301 ఆలౌట్.
ఫలితం: 186 పరుగుల తేడాతో ఇండియా-ఎ విజయం

స్కోరు వివరాలు

ఇండియా- సి
మొదటి ఇన్నింగ్స్ 525 పరుగులకు ఆలౌట్
రెండో ఇన్నింగ్స్ 124/4 డిక్లేర్
ఇండియా- బి
మొదటి ఇన్నింగ్స్- 332 పరుగులకు ఆలౌట్
రెండో ఇన్నింగ్స్- ఆరంభించలేదు
ఫలితం- మ్యాచ్ డ్రా



ఉమ్మడి జిల్లాలో క్రికెట్ స్టేడియం నిర్మాణం

ఉమ్మడి జిల్లాలో స్టేడియం నిర్మించి, ఆంధ్రాక్రికెట్ అకాడమీ ఏర్పాటు చేస్తామని ఏసీఏ మౌలిక వసతుల కల్పన కమిటీ ఛైర్మన్ విజయ్‌కుమార్ తెలిపారు. దులీప్‌ట్రోఫీని రాయలసీమ ప్రాంతంలోని అనంతపురం నిర్వహించడం శుభపరిణామమన్నారు. రాయలసీమ క్రీడాకారులు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించేలా తీర్చిదిద్దుతామన్నారు.

కిటకిటలాడిన స్టేడియం

తొలిమ్యాచ్ మాదిరి మూడు రోజులకే ముగియకుండా నాలుగు రోజుల పాటు ఆట కొనసాగడం, చివరి రోజు ఆదివారం కావడంతో ఆర్డీటీ స్టేడియం ప్రేక్షకులతో కిటకిటలాడింది. పాఠశాల, కళాశాలల విద్యార్థులు ఆటను ప్రత్యక్షంగా చూసేందుకు స్టేడియానికి తరలివచ్చారు. ఈలలు, కే రింతలతో ఆటగాళ్లను ప్రోత్సహించా రు. నగర ప్రజలు, జిల్లాలోని క్రీడాభిమానులు స్టేడియానికి తరలి వచ్చి ఆనందించారు. కార్యక్రమంలో ఆర్డీటీ ప్రో గ్రాం డైరెక్టర్ మాం చోపెర్రర్, బీసీసీఐ మేనేజర్ అమిత్ సిద్దేశ్వర్, ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్, జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

20 నుంచి క్రీడాపోటీలు

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 15: జిల్లా గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి అండర్-14, 17 విభాగానికి సంబంధించి క్రీడాపోటీలు మండలంలో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు లింగా నాయక్, నవీదా తెలిపారు. బుక్కరాయసముద్రం ఆర్డీటీ మైదానం, సిద్ధరాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్ ఈ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

టమోటా కిలో రూ.33

అనంతపురంరూరల్, సెప్టెంబరు 15: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.33తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. ఆదివారం 2,250 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.25, కనిష్ఠ ధర రూ.17పలికినట్లు ఆయన తెలిపారు.

పెరిగిన పశువుల సంత ఆదాయం

అనంతపురంరూరల్, సెప్టెంబరు 15: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో పశువుల సంత ఆదాయం ఈ వారం పెరిగింది. బుధవారం మాలపౌర్ణమి కావడంతో. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంతతో మార్కెట్ కమిటీకి రూ.2,67,725 ఆదాయం వచ్చింది. అలాగే ఆదివారం ఆవులు, గేదెల సంతతో రూ.1,62,350 ఆదాయం వచ్చింది. రెండురోజుల సంతతో రూ.4,30,075 సమకూరినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి పేర్కొన్నారు.

జిల్లా అథ్లెటిక్స్ కోచ్‌కు అరుదైన గుర్తింపు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 15: జిల్లాకు చెందిన అథ్లెటిక్ కోచ్ సురేష్‌కుమార్‌కు అరుదైన గుర్తింపు లభించింది. ఆగస్టు 28వతేదీ నుంచి సెప్టెంబరు 8వతేదీ వరకు పారిస్‌లో నిర్వహించిన పారా ఒలంపిక్స్‌లో జిల్లాకు చెందిన అథ్లెటిక్ కోచ్ సురేష్‌కుమార్ భారత జట్టు కోచ్‌గా వ్యవహరించారు. ఇందులో భారత్‌కు 7 బంగారు, 9 వెండి, 13 కాంస్య పతకాలు సాధించారు. భారత కోచ్‌గా వ్యవహరించిన సురేష్‌కుమార్‌ను ఇటీవల ఢిల్లీలోని నివాసంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభినందించారు. ఈ విషయాన్ని కోచ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు.



ప్రధాని మోదీని కలిసిన వారిలో జిల్లా అథ్లెటిక్స్ కోచ్ సురేష్‌కుమార్

అసమానతలు తొలగితేనే సమగ్రాభివృద్ధి

జేవీవీ మహాసభలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 15: ప్రాంతీయ అసమానతలు తొలగితేనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ లక్ష్మణరావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న జేవీవీ వార్షిక రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వాల లెక్కల ప్రకారం అభివృద్ధి అంటే జీడీపీ, తలసరి ఆదాయం వంటి ఆర్థికపరమైన అంశాలే అన్నారు. మానవ వనరులు అభివృద్ధి చెందినపుడే అభివృద్ధి అని పేర్కొన్నారు. అందరికీ విద్య, వైద్యం, ఉపాధి లభించినపుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఏపీ అంటే అమరావతి, పోలవరం మాత్రమే కాదని, రాష్ట్రంలో ఉత్తరాంధ్ర, రాయలసీమ వెనుకబడి ఉన్నాయని ప్రభుత్వాలు గుర్తించాలన్నారు. జేవీవీ రాష్ట్ర నాయకుడు బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ మన సమాజంలో అశాస్త్రీయమైన భావాలను అనేక ఏళ్లుగా అందరి మెదళ్లలో నాటి ఉన్నారని, వీటిని తొలగించే ప్రయత్నం చేయాలంటే సైన్సు ప్రచారాన్ని విస్తృతం చేయాలన్నారు. ప్రధానంగా యువత మరింతగా పనిచేయాల్సిన అవసరముందని, వారిని చైతన్యపరిస్తే సమాజం అభివృద్ధి వైపు పయనిస్తుందని వివరించారు. ఇపుడున్న అశాస్త్రీయ భావాల ప్రభావమే యువతపై ఎక్కువగా ఉందన్నారు. దీనిని అధిగమించేందుకు జేవీవీ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, జేవీవీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్, ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, ఉపాధ్యక్షుడు త్రిమూర్తులు, కార్డియాలజిస్టు వంశీకృష్ణ, జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా నాయకులు డాక్టర్ ప్రసూన, గంగేనాయక్, మహ్మద్ జిలాని, నగర అధ్యక్ష కార్యదర్శులు రామిరెడ్డి, వీర్రాజు, నాయకులు రామకృష్ణ, ప్రసాద్‌రెడ్డి, ప్రసాద్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

రెండురోజులు సుదీర్ఘ చర్చలు

జన విజ్ఞాన వేదిక మహాసభల సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన జేవీవీ నాయకులు, కార్యకర్తలు రెండురోజులపాటు సుదీర్ఘ చర్చలు జరిపారు. ఇందులో ఈ రెండేళ్ల కాలంలో చేపట్టిన కార్యక్రమాలను ఆయా ప్రాంతాలవారీగా వివరించారు. అదేవిధంగా ఇపుడున్న పరిస్థితుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడానికి చేయాల్సిన పనులపైనా చర్చించారు. ప్రధానంగా యువతలో శాస్త్రీయ భావాల పెంపుదలకు కృషిచేయడంపై దృష్టి సారించాలని మహాసభల్లో చర్చించారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించారు.

జీడిపల్లికి 1026 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 15 : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 1026 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 932 క్యూసెక్కులు, పీఏబీఆర్‌కు మరువ నుంచి 50 క్యూసెక్కులు వెళుతున్నట్లు వెల్లడించారు.

ఆర్టీఓ కార్యాలయం పరిశీలన



ఆర్టీవో కార్యాలయంలో మొక్క నాటుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

కదిరి అర్బన్, సెప్టెంబరు 15: పట్టణంలోని ఆర్టీఓ కార్యాలయాన్ని ఆదివారం రవాణా శాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. ఆయన ధర్మవరంలో ఓ ప్రయివేటు కార్యక్రమానికి హాజరైన అనంతరం రాయచోటికి వెళ్తూ, మార్గమధ్యలో కదిరి ఆర్టీఓ కార్యాలయాన్ని పరిశీలించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీవో కార్యాలయంలో అందుతున్న సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించేలా పనిచేయాలని సూచించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఆర్టీవో శ్రీనివాసులు, ఎంవీఐ వరప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

● మంత్రికి విన్నవించిన ఆర్టీసీ ఈయూ నాయకులు

ధర్మవరం, సెప్టెంబరు 15: ధర్మవరం ఆర్టీసీ డిపో అభివృద్ధితో పాటు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎంప్లాయీస్ యూనియన్ సత్యసాయిజిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి విన్నవించారు. మంత్రి ఆదివారం ధర్మవరంలోని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డికి స్వగృహానికి విచ్చేశారు. ఈయూ జిల్లా అధ్యక్షుడు, నాయకులు నరసింహులు, బాబు, సుమో శీన, రామక్రిష్ణ మంత్రిని కలిసి సమస్యలతోకూడిన వినతిపత్రాన్ని అందజేశారు. డిపోలో గతంలో 85సర్వీసులుండేవని,వాటిలో చాలా సర్వీసులు రద్దు అయ్యాయన్నారు. ప్రభుత్వంత్వరలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరిన్ని సర్వీసులు పెంచాలని వారు మంత్రిని కోరారు.

నేడు శాంతి ర్యాలీ

కదిరి అర్బన్, సెప్టెంబరు 15: మిలాద్-ఉన్-నబి పండుగను పురస్కరించుకుని సోమవారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ కమిటీ సెక్రటరీ మక్బూల్ అలీఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు అమీనియా మసీదునుంచి ర్యాలీ ప్రారంభమై నానా దర్గా, ఇక్బాల్‌రోడ్డు, మెయిన్‌రోడ్డు, బైపాస్‌రోడ్డు మీదుగా కొనసాగుతుందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు.

రేపు జాబ్‌మేళా

పుట్టపర్తి, సెప్టెంబరు 15: నిరుద్యోగ యువతకు మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, నియోజకవర్గంలోని ని రుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆదివారం ఓప్రకటనలో కోరారు. అమర్‌రాజా కంపెనీలో ఆపరేటర్లుగా, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందని పది, ఇంటర్, ఐటీఐ పాస్ ఆర్ ఫెయిల్ అయిన వారు పాల్గొనవచ్చన్నారు.

శిక్షణకు వెళ్లనున్న ఎంపీడీఓలు, ఈఓఆర్డీలు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 15: కెపాసిటీ ఆఫ్ బిల్డింగ్ శిక్షణకోసం జిల్లా నుంచి పలువురు ఎంపీడీఓలు, ఈఓఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు సోమవారం శ్రీకాళహస్తికి వెళ్లనున్నారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణకు ఉమ్మడి జిల్లా నుంచి పది మంది ఎంపీడీఓలతో పాటు అనంతపురం జిల్లా నుంచి ఐదుగురు ఈఓఆర్డీలు, ఐదుగురు పంచాయతీ కార్యదర్శులను ఎంపిక చేసినట్లు డీపీఓ ప్రభాకర్‌రావు తెలిపారు. ఎంపీడీఓలు పుల్లయ్య, తేజోత్న సలోమాన్, రామచంద్ర, రంగారావ్, మనోహర్, నరేష్‌క్రిష్ణ, నాగేంద్రకు మార్, విజయలక్ష్మి, కొండన్న, ఈఓఆర్డీలు వెంకటేష్, సదాశివ, మురళీ క్రిష్ణ, బోడేన్న, నాగభూషణ, కార్యదర్శులు సాధిక్‌వలి, ప్రసాద్, రామక్రిష్ణ, బాబాఫక్రుద్దీన్ వెళ్లనున్నారు.

సభ్యత్వ నమోదులో ధర్మవరం ముందుండాలి

● మంత్రి సత్యకుమార్ యాదవ్



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం, సెప్టెంబరు 15: భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదులో ప్రతి ఒక్క కార్యకర్త భాగస్వాములై ధర్మవరాన్ని రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలపాలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని 8వ వార్డులో ఆదివారం శ్రీరాములవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సభ్యత్వ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ.. బీజేపీ ప్రతి మూడుసంవత్సరాల ఒకసారి సభ్యత్వం చేపడతామన్నారు. 18 కోట్ల సభ్యత్వంతో ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ బీజేపీ అన్నారు. ప్రదాని నరేంద్రమోదీ పాలనలో ప్రపంచ వ్యాప్తంగా అందరూ మంచిగుర్తింపును తెచ్చిపెట్టడం. దేశప్రజలందరికీ పథకాలు పెడుతున్నామన్నారు. పేదరికాన్ని పారదోలేందుకు పార్టీ మరింత కృషిచేస్తోందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు దేవానంద్, నాయకులు గిర్రాజు నగేశ్, ఓబుళేశు, చంద్రశేఖర్, గిర్రాజురవి పాల్గొన్నారు.

రాజమ్మ కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

తనకల్లు, సెప్టెంబరు 15: మండలంలోని ఈతోడు గ్రామానికి చెందిన రాజమ్మ మనవరాలు అక్షయ ఆటోలో ప్రయాణిస్తూ ప్రమాదానికి గురైంది. ప్రమాదంలో రాజమ్మకు కాళ్ల చేతులు విరిగి మంచానికే పరిమితమైంది. మవరాలు అక్షయకు చేయి విరగడంతో ఇంటిలోనే ఉంటోంది. కుటుంబ పెద్ద మంచానికి పరిమితం కావడంతో పోషణ భారంగా మారింది. విషయాన్ని పత్రికల ద్వారా తెలుసుకున్న తోటి విద్యార్థులు రూ.12,400 ఆర్థికసాయాన్ని ఆ కుటుంబానికి ఆదివారం అందించారు.

పంచాయతీ కార్యాలయానికి మెరుగులు



పంచాయతీ కార్యాలయం వద్ద శుభ్రం చేసిన దృశ్యం

నంబులపూలకుంట, సెప్టెంబరు 15: మండలకేంద్రంలో ప్రజా అవసరాలకు అనుగుణంగా గత టీడీపీ పాలనలో నిర్మాణాలు చేపట్టిన పంచాయతీ కార్యాలయం నిర్మాణ దశలోనే ఆగిపోయింది. అనంతరం వైసీపీ అధికారంలోకిరాగానే నిర్మాణాలు నిలిపివేశారు. గ్రామ సచివాలయ భవనాన్ని మరోప్రాంతంలో నిర్మించారు. ఈ పంచాయతీ భవనం పశువులు, గొర్రెలకు ఆవాసంగా మారింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ భవనాలు దుర్వినియోగం కాకూడదని, పంచాయతీ భవనంలో పేరుకుపోయిన, పేడదిబ్బలను, చుట్టుపక్కల ప్రాంతాలను ఎంపీడీఓ మనోహర్‌బాబు శుభ్రం చేయించారు. ఈప్రాంతాన్ని సంతగా ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఓబుళదేవరచెరువు: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



సుభాష్ ట్యుటోరియల్‌లో అప్పటి గురువులను సన్మానించిన విద్యార్థులు

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 15: ఒకేపాఠశాలలతో చదువుకున్న మిత్రలు 44యేళ్ల తరువాత ఆదివారం కలిశారు. మండలంలోని గౌనిపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో 1980-81లో పదో తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అప్పటి ప్రధాన ఉపాధ్యాయులు జయచంద్రారెడ్డి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు సేవా గుణం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. చలపతి, రాజారెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, జనార్దన్‌గుప్తా, మంజుల, రత్నకుమారి, రమణారెడ్డి, మెడికల్ శ్రీనివాసరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కదిరి: పట్టణంలోని సుభాష్ ట్యుటోరియల్‌లో 1991-92లో పది చదివిన బాచ్ 32 సంవత్సరాల తరువాత ఆదివారం కలిశారు. స్థానిక పంచాయతీ రాజ్ సమీపంలోని ఐరిష్ ఫంక్షన్‌హాల్‌లో సమావేశం అయ్యారు. అప్పటి చిలిపి చేష్టలు గుర్తు చేసుకుని ఒకరిక్కొరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ప్రస్తుతం వారు చేస్తున్న విధులు, విజయాల గురించి చర్చించారు. అప్పటి గురువులు భాస్కర్‌రెడ్డి, రజాక్, లక్ష్మీనారాయణరెడ్డి, బాబు, రవి లోకన్నలను సన్మానించారు. పూర్వ విద్యార్థులు శ్రీనివాసులు, సాయిప్రసాద్, నాగేంద్రకుమార్, పార్థసారథిరెడ్డి, మహబూబ్‌బాషా, జనార్థన్, రవీంద్రారెడ్డి, అల్తాఫ్, వాణిశ్రీ, హేమలత, పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

కదిరి అర్బన్: మండలంలోని పట్నం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో 2011-12లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఒక్కచోట కలిశారు. 12 ఏళ్ల తరువాత అందరూ ఒకచోట చేరి, అప్పటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అప్పటి గురువులు రామచంద్ర, శంకర్, చంద్రశేఖర్, హరినాథ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ఉషారాణి, సిద్ధారెడ్డి, దివాకర్, మన్సూర్‌లను సన్మానించారు. పూర్వ విద్యార్థులు ప్రసన్న, మౌలిక, లక్ష్మీ, విజయలక్ష్మి, అశోక్, మాలిక్, వెంకటరమణ, సాయికుమార్ పాల్గొన్నారు.



పట్నం జడ్పీ పాఠశాలలో...

ఆదర్శప్రాయుడు సీతారాం ఏచూరి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి అర్బన్, సెప్టెంబరు 15: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో సీతారాం ఏచూరి మృతిపై సంతాప సభ నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టు పార్టీలకు తీరని లోటన్నారు. విద్యార్థిదశనుంచే పేదల పక్షపాతి, ప్రజా సమస్యలపై పోరాడే గొప్ప ఉద్యమకారుడని కొనియాడారు. సీపీఎం నాయకులు రాంభూపాల్‌రెడ్డి, సుబ్బిరెడ్డి, జీఎల్ నరసింహులు, జగన్మోహన్, అడ్వకేట్ నరసింహులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరద బాధితులకు బియ్యం సేకరణ



దొన్నికోటలో బియ్యాన్ని సేకరిస్తున్న టీడీపీ నాయకులు

నల్లమాడ, సెప్టెంబరు 15: మండలంలోని దొన్నికోట గ్రామంలో విజయవాడ వరద బాధితుల సాయం కోసం 36 ప్యాకెట్ల బియ్యం సేకరించినట్లు మండల మాజీ కన్వీనర్ కేశవరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఇంటింటా తిరిగి బియ్యాన్ని సేకరించామన్నారు. బియాన్ని నల్లమాడ కన్వీనర్ మైలే శివశంకర్ నివాసంలో ఆయనకు అందచేసినట్లు తెలిపారు. వెంకటరమణనాయుడు, గంగులప్పనాయుడు, పెద్దప్పయ్యనాయుడు, రా మిరెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.


పొంచి ఉన్న ప్రమాదం



చింతమానులో నుంచి వెళ్లిన విద్యుత్ తీగలు

నల్లమాడ, సెప్టెంబరు 15: మండల కేం ద్రంలోని పాత సినిమా టెంటు సమీపంలోవి ద్యుత్‌తీగలు ప్రమాదకరంగా మారాయి. గ్రా మం మధ్యలో ఓ చింతమాను సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభం నుంచి సమీప నివాస గృహాలకు కనెక్షన్లు ఇచ్చారు. ఆ స్తంభంనుంచి మరో స్తంభానికి విద్యుత్ మెయిన్ లైన్ వెళ్లింది. వైర్లు చింతమానులో నుంచి వేళ్లాయి. గాలి, వర్షం వస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక అలంకరణలో దుర్గావీరభద్రస్వాములు




లేపాక్షి, సెప్టెంబరు 15: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన దుర్గావీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం దుర్గా, వీర భద్రస్వాములను రంగు రంగుల పూలతో ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. వరుస సెలవులు కావడంతో ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి స్వాములను దర్శించుకున్నారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 15 : రొద్దం మండలంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం రొద్దం గ్రామంలో నిమజ్జనం కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

భవన నిర్మాణ కార్మికులు ఏకం కావాలి

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 15: తమ సమస్యల పరిష్కారానికి మండల వ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులు తరలి రావాలని నాయకులు కొండా వెంకటేశులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈనెల 30న స్థానిక వెంకటేశ్వర కళ్యాణమండపంలో జరుగు సమావేశానికి కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

అగళి, సెప్టెంబరు 15 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 17న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జడ్పీటీసీ సభ్యుడు ఉమేష్ తెలిపారు. బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరవుతారన్నారు.

కొనసాగుతున్న విరాళాల సేకరణ

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 15: విజయవాడలోని వరద బాధితులకు సహాయం అందించేందుకు బీజేపీ నాయకులు ఇంటింటా తిరిగి ఆర్థిక సాయం సేకరించారు. ఈ సందర్భంగా ఆదివారం బీజేపీ నాయకులు గోపీనాథ్ ఆధ్వర్యంలో పలు కాలనీల్లో పర్యటించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎనుమల రామక్రిష్ణ, రవి, హనుమంతుయాదవ్, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

పెనుకొండ, సెప్టెంబరు 15: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నారాయణసేవ కార్యక్రమంలో భాగంగా పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం వారపు సంతకు వచ్చిన గ్రామీణ ప్రాంత ప్రజలకు, పేదలకు, యాచకులకు స్థానిక అయ్యప్పస్వామి దేవాలయంలో ఊరువాకిలి ఆంజనేయస్వామి ఆలయం, బాబయ్య దర్గా వద్ద సేవాసమితి సభ్యులు అన్నదానం, మంచినీటి బాటిళ్ల పంపిణీ చేశారు.

నిమజ్జనానికి సహకరించండి: సీఐ

మడకశిరటౌన్, సెప్టెంబరు 15: మడకశిర పట్టణంలో ఈనెల 17న వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించే సమయంలో అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని సీఐ రామారావు కోరారు. ఆదివారం సర్కిల్ కార్యాలయంలో వినాయక విగ్రహాల కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. సమయానికి అనుగుణంగా మడకశిర పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద నుంచి అందరూ బయలుదేరి ఎలాంటి సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని కోరారు.

దిష్టిబొమ్మలా పోలీస్ ఔట్‌పోస్ట్



లేపాక్షి, సెప్టెంబరు 15: ప్రముఖ పర్యాటక కేంద్రమైన లేపాక్షి ఆలయానికి భారతదేశ నలుమూలల నుంచి పర్యాటకుల సంఖ్య పెరిగింది. దీనిని దృష్టిలో ఉంచుకుని పర్యాటకుల భద్రత కోసం పోలీసు ఉన్నతాధికారులు నంది విగ్రహం వద్ద పోలీస్ ఔట్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. శని, ఆదివారాలలో పర్యాటకుల భద్రత కోసం ఇక్కడ పోలీసులు ఉండాలి. ఇక్కడ పోలీసులు లేకపోవడంతో పోలీస్ ఔట్‌పోస్టు దిష్టిబొమ్మలా మారింది. పర్యాటకుల భద్రతను గాలికి వదిలేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శని, ఆదివారాల్లో జేబు దొంగల చేతివాటం అధికమయిందని పర్యాటకుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పోలీస్ ఔట్‌పోస్టును పునరుద్ధరించాలని కోరుతున్నారు.

పంచాయతీ బోరుకు దారి ఏర్పాటు

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 15: మండల కేంద్రంలోని స్థానిక చెరువులో ఏర్పాటు చేసిన పంచాయతీ బోరుకు ఆదివారం అధికారులు దారిని ఏర్పాటు చేశారు. వర్షాల కారణంగా చెరువులో నీరు చేరి బోరు మునిగిపోవడంతోపాటు సమీపంలో ఉన్న కాలనీలకు నీరందించడంలో ఇబ్బందిగా మారిన తరుణంలో పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులు ఆదేశాలతో దారిని ఏర్పాటు చేసినట్లు స్థానికులు తెలిపారు.

రేపు జాబ్‌మేళా

పుట్టపర్తి, సెప్టెంబరు 15: నిరుద్యోగ యువతకు మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, నియోజకవర్గంలోని ని రుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

అడవి జంతువులతో బెంబేలు..

పొలాలన్నీ బీళ్లు

నష్టపోతున్న రైతన్నలు... పెట్టుబడులు మట్టిపాలు


పొలాల్లో జింకల సంచారం

మడకశిర, సెప్టెంబరు 15: అడవి జంతువుల సంచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏ పంట సాగు చేసినా ఏదోవిధంగా పంట దెబ్బతిని నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడవి పందులు, జింకలు పంటలపై దాడులు చేయడంతో పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి అందడం లేదు. దీంతో ప్రతి పంట సాగుకు అప్పులు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. సాగుచేసిన పంటలను రక్షించుకోవడానికి రైతన్నలు పడుతున్న బాధలు వర్ణాణాతీతంగా ఉన్నాయి. కర్ణాటక సరిహద్దు ప్రాంతం అయిన మడకశిర నియోజకవర్గంలో 50 శాతం పైబడి కొండలు, గుట్టలు అధికంగా అటవీ ప్రాంతానికి ఆనుకుని జింకలు, అడవి పందులు, ఎలుగుబంట్ల బెడద అధికంగా ఉంది. ఆ పరిసర ప్రాంతాల్లో సాగుచేసిన పంటలపై పడి నాశనం చేస్తున్నాయి. గతంలో పంటలు సాగు చేసినప్పుడు రైతులు పంట పొలాల వద్దకు కాపలాగే వెళ్లి కాపాడుకునేవారు. ఇటీవల ఎలుగుబట్లు, చిరుతల సంచారం అధికంగా ఉండడంతో రైతులు పొలాల వద్దకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. దీంతో జింకలు, అడవి పందులు పంటలపై పడి నాశనం చేస్తున్నాయి. ఎకరా పంటసాగు చేసేందుకు రూ.10నుంచి 15వేల దాకా ఖర్చు వస్తోందని, మొత్తం నష్టపోతున్నామని తెలిపారు. పంటలను కాపాడుకోవడానికి పొలాల చుట్టూ చీరలతో కంచె మాదిరిగా కడుతున్నారు. అయినా అవి దాడి చేసి పంటను నష్ట పరుస్తున్నాయని రైతులు వాపోతున్నారు. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది రైతులు పంటలు సాగు చేయడానికి ఆస్తకి చూపడం లేదు. దీంతో పొలాలన్నీ బీడుగా


పంటను కాపాడుకునేందుకు చీరలతో కంచె ఏర్పాటు

అటవీ ప్రాంతంలో బీడుగా మారిన పంట భూములు



మారిపోతున్నాయి. కర్ణాటక ప్రాంతంలో అటవీ, కొండలు, గుట్టల ప్రాంతాల్లో వన్య ప్రాణుల సంచారం అధికంగా ఉన్న చోట కంచె వేశారు. మన ప్రాంతంలో కూడా పలుచోట్ల రాతి గోడల నిర్మాణం చేపట్టారు. అవి కొన్నిచోట్ల దెబ్బతిన్నాయి. వాటిని మర్మతులు చేయిస్తే అడవి పందులు, జింకల దాడి నుంచి పంటలను రక్షించుకోవడానికి వీలుంటుందని రైతులు అంటున్నారు. మడకశిర మండలం జమ్మానపల్లి గ్రామంలోని సాగుచేసిన వరి, రాగి తదితర పంటలపై జింకలు దాడి చేసి నష్ట పరుస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ఒక పక్క తెగుళ్లు, వర్షాభావం మరోపక్క అడవి పందులు, జింకల వల్ల పంటనష్టపోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

మూడు ఎకరాల్లో వేరుశనగ సాగు : కాంతరాజు, మల్లినమడుగు



ప్రతి ఏటా ఐదు ఎకరాల్లో వేరువనగ పంట సాగు చేసేవాళ్లం. జింకలు పంటపై దాడులు చేస్తుండడంతో పంట దెబ్బతిని నష్టపోతున్నాం. ఈసారి ఖరీఫ్‌లో మూడు ఎకరాల్లో మాత్రమే వేరుశనగ పంట సాగు చేసి మిగతా రెండు ఎకరాల పొలాన్ని బీడు పెట్టు కోవాల్సి వచ్చింది. పంట సాగు చేయడానికి ఎకరాకు రూ. 15 వేల దాకా ఖర్చు వస్తుంది. జింకలు పంటపై దాడి చేయడంతో పంట దెబ్బతిని నష్ట పోవాల్సి వస్తోంది. అడవి జంతువులు పంటలపై దాడులు చేయకుండా అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. పొలాల వద్దకు కాపలా వెళ్లాలంటేనే భయాందోళన చెందే పరిస్థితి నెలకొంది.

మా గణపయ్య ఎక్కడ..?

గుడ్డం కోనేరు వద్ద యువకుల వెతుకులాట

సరిగ్గా నిమజ్జనం జరగలేదంటూ ఆవేదన

హిందూపురం, సెప్టెంబరు 15 : వినాయక చవితి పండగను పురస్కరించుకుని హిందూపురం పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలు నిమజ్జన కార్యక్రమం ఆదివారం తెల్లవారుజామున ముగిసింది. గుడ్డం కోనేరువద్ద శుక్రవారం నుంచి నిమజ్జనం చేసిన విగ్రహాల నిర్వాహకులు ఆదివారం కొంతమంది యువకులు అక్కడికి చేరుకుని తమ వినాయకుడు ఎక్కడా అంటూ వెతుకులాటలో పడ్డారు. వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసినప్పుడు ఐరన్ ఆంగ్లర్లు, ప్లాట్‌ఫాం, విగ్రహాన్ని కోనేరులో వదిలేశారు. దీంతో వాటిని వెనక్కు తీసుకునేందుకు కొంతమంది యువకులు కోనేరువద్దకు చేరుకుని నిమజ్జనం అయిన వినాయకుల వద్దకు వచ్చి తమ వినాయకుడు ఎక్కడా అంటూ వెతికే పనిలో పడ్డారు. విగ్రహాలను నిమజ్జనం చేసిన వెంటనే మునిసిపల్ అధికారులు ఎక్స్‌కవేటర్ల సాయంతో మరోవైపుకు లాగేశారు. ఎవరి విగ్రహం ఎక్కడుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. దీనికారణంగా చాలా మంది యువకులు వారి విగ్రహానికి ఏర్పాటు చేసిన కర్రలు, ఐరన్ ఆంగ్లర్లు, ప్లాట్‌ఫాంలు గుర్తించే పనిలో పడ్డారు. ఈసారి భారీ విగ్రహాలు ఏర్పాటు చేశారు. కోనేరులో నీరు తక్కువగా ఉండటంతో విగ్రహాలు పూర్తిస్థాయిలో మునగలేదు. చాలా విగ్రహాలు పైనే తేలియాడుతున్నాయి.


కోనేరువద్ద తమ విగ్రహాలను వెతుకుతున్న యువకులు

మరికొన్ని విగ్రహాలు సగమే మునగడంతో అక్కడ వాటిని చూసినవారు ఏడు రోజులు పూజలు చేసి నిమజ్జనంచేస్తే సగం మాత్రమే మునిగాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంకానా..!

పేరుమారని వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్యకేంద్రం



లక్ష్మీపురంలోని పట్టణ ఆరోగ్య కేంద్రం

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 15: ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక గత ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా ఏర్పాటు చేసిన పేర్లను మార్చింది. కానీ హిందూపురం పట్టణం లక్ష్మీపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు స్వామిభక్తిని చాటుకుంటున్నారు. గతంలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్ఆర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగానే బోర్డును కొనసాగిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ప్రాంత వైసీపీ నాయకుల ప్రోద్బలంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రంగా బోర్డును ఏర్పాటు చేశారు. ప్రభుత్వం మారిన తర్వాత అన్నిచోట్లా బోర్డులు మార్చినా లక్ష్మీపురం ఆరోగ్య కేంద్రానికి వైఎస్ఆర్ పేరే కొనసాగుతోంది. భవనానికి కూడా డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రంగానే రాసి ఉంది. దీనిని చూసి స్థానికులు ఇదేమిటి ఇంకా ఆ ప్రభుత్వ వాసనలు పోలేదా అని చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందిస్తారో లేదో చూడాలి.

తెలుగుభాషను కాపాడుకోవాలి

గోరంట్ల, సెప్టెంబరు 15: కనుమరుగవుతున్న తెలుగు భాష ఔన్నత్యాన్ని, సాహితీ సంస్కృతిని ప్రతి ఒక్కరు కాపాడాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. గోరంట్లలోని ఎస్‌వీవీఎం డిగ్రీ కళాశాలలో సాహితీ, సాంస్కృతిక వేదిక పేరుతో కవులు, కళాకారులు, రచయితలు, సినీరంగ ప్రముఖులు, వివిధ సేవా కార్యకర్తలతో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో దేవాంగం జగదీశ్వర్, నరెద్దుల రాజారెడ్డి, కొండాపురం విజయశ్రీ, భక్తవత్సలం ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో వివిధ రంగాల్లో రాణిస్తున్నవారిని ప్రోత్సహించడానికి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశ భాషల్లోనే తెలుగు లెస్స అనిపించుకున్న భాషకు ప్రోత్సాహం కరువైందన్నారు. పరభాష వ్యామోహంలో తెలుగును విడనాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలోనూ తెలుగు పండితులు నెలకోసారి తెలుగు భాష సాహిత్యం, ప్రాచీన కలలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. వివిధరంగాల్లో రాణించిన ప్రముఖులను సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో



మాట్లాడుతున్న కల్లూరి రాఘవేంద్రరావు

రచయితలు కల్లూరు రాఘవేంద్రరావు, సొంటి జయప్రకాష్, కరస్పాండెంట్ పెద్దరాసు సుబ్రహ్మణ్యం, కోగిర జయచంద్రారెడ్డి, చరిత్రకారుడు మైనాస్వామి, సినీ నిర్మాత జీఎం సురేష్, ఖగేంద్ర, సుభామహి, పోతుల రామక్రిష్ణారెడ్డి, దేవిస్వామి, నెంబర్ నాగరాజు, వట్టి వెంకటరమణ, నాగభూషణ, సూర్యనారాయణరెడ్డి, క్రిష్ణప్రసాద్, రామక్రిష్ణారెడ్డి తదితరులు ప్రసంగించారు.



ఘనంగా వినాయక నిమజ్జనం

మడకశిర రూరల్/అమరాపురం/పావగడ, సెప్టెంబరు 15 : మండలంలోని బుళ్లసముద్రం పంచాయితీ కేంద్రంలో ఆదివారం యువకులు గణేష్ నిమజ్జనాన్ని వైభంగా నిర్వహించారు. బీసీ కాలనీలోని యువకులు వినాయకుడికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి నీటి కుంటలో నిమజ్జనం చేశారు. అమరాపురం మండలంలోని కాచికుంట, పేలుబండ గ్రామాల్లో గణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బొజ్జగణపయ్యను యువకులు ఉత్సాహంగా నిమజ్జనం చేశారు. పావగడ తాలూకా వ్యాప్తంగా నెలకొల్పిన గణేషుడిని ఘనంగా నిమజ్జనం చేశారు.


వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెళుతున్న యువకులు


అమరాపురంలో నిమజ్జనానికి బయల్దేరే ముందు గణపయ్య

పారిశ్రామికాభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎంఎస్ రాజు, తిప్పేస్వామి

మడకశిరటౌన్, సెప్టెంబరు 15 : మడకశిరను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యంగా పెట్టుకొన్నామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా సోమవారం మడకశిర పట్టణంలో జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణంలోని యాదవ కల్యాణ మండపం నందు ఉదయం 10 గంటలకు అమర్‌రాజాగ్రూప్ ఆఫ్ కంపెనీ వారిచే జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, పాస్ లేదా ఫెయిల్ అయిన వారు జాబ్‌మేళాకు హాజరు కావచ్చన్నారు. శిక్షణ సమయంలో రూ.12వేలు ఉపకారవేతనం, అనంతరం రూ.22వేలు జీతం ఇస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని మడకశిర నియోజకవర్గంలోని ఐదు మండలాల నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామిని కలిశామని, ఆర్.అనంతపురం వద్ద 1600 ఎకరాల్లో పరిశ్రమలు నెలకొల్పేందుకు ఆయన భరోసా ఇచ్చారని తెలిపారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందితే నియోజకవర్గం అన్ని రంగాల్లోనూ వేగం పుంజుకుంటుందన్నారు.

ఘనంగా ప్రజాస్వామ్య దినోత్సవం


మానవహారంగా ఏర్పడిన అధికారులు, నాయకులు

పావగడ, సెప్టెంబరు 15 : అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం సందర్భంగా పావగడ పట్టణంలోని అంబేడ్కర్‌సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఉదయం 8.30 గంటలకు సాంఘిక సంక్షేమశాఖ మునిసిపల్ కార్యాలయం, బీఈఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల నుంచి విద్యార్థుల సమక్షంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జైభీమ్ అంటూ నినాదాలతో మానవహారం ఏర్పరచి శని మహాత్మ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు.

సిద్దేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



మడకశిర(అమరాపురం), సెప్టెంబరు 15: అమరాపురం మండలం హేమావతి గ్రామంలో వెలిసిన శైవక్షేత్రమైన నొళంబ రాజుల స్థాపించిన హెంజేరు సిద్దేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం కుంకుమార్చన, మహామంగళ హారతి, తైలాభిషేకం, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. సిద్దేశ్వరస్వామికి ప్రత్యేకంగా పూలతో అలంకరించి వెండి కవచాలు ధరించి విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు సిద్దలింగేశ్వరస్వామి, మహేష్‌స్వామి, శివకుమార్‌స్వామి, గౌతమ్, ప్రదీప్ భక్తులకు అన్నదానాన్ని ఏర్పాటు చేశారు.

ముస్లింలకు మద్దతివ్వండి

ఎంపీ బీకే పార్థసారథికి వినతి


ఎంపీ పార్థసారథికి వినతిపత్రం ఇస్తున్న ముస్లింలు

హిందూపురం, సెప్టెంబరు 15: వక్ఫ్‌బోర్డ్ చట్టసవరణ విషయంలో ముస్లింలకు మద్దతు పలకాలంటూ ముస్లింలు హిందూపురం ఎంపీ బీకే పార్థసారథిని కోరారు. ఆదివారం అనంతపురంలో ఎంపీ నివాసం వద్ద హిందూపురం, గోరంట్ల, అనంతపురం మైనార్టీలు కలిశారు. పార్లమెంట్‌లో వక్ఫ్‌బోర్డ్ చట్టసవరణపై ముస్లింలకు న్యాయం జరిగేలా చూడాలని వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో హిందూపురం ముస్లిం నాయకులు ఉమర్‌ఫారూక్, అజ్మతుల్లా, ఉస్మాన్‌ఖాన్, అమానుల్లా, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.